గాలికుంటు.. పశువులకు ప్రాణాంతకం

- వ్యాధిపై నెలరోజులుగా విస్తృత ప్రచారం-వాక్సినేషన్
- నేటితో ముగియనున్న ప్రక్రియ
- పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలంటూ సూచన



గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు టీకాల కార్యక్రమం

ప్రత్తిపాడు: గాలికుంటు వ్యాధి.. ఈ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో, కారే చొంగతో నానా ఇబ్బందులు పడుతుంటాయి. ఈ వ్యాధిని నిర్లక్ష్యం వహిస్తే పశువులు మరణం ముంగిట మోకరిల్లడం మినహా ప్రత్యామ్నాయం ఉండదు. వ్యాధిని నివారించేందుకు టీకాలు వేయడం ఒక్కటే మార్గం. అందుచేత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా గత నెల నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రత్తిపాడు ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాల్లో మొత్తం 1,777 ఆవులు, 15,487 గేదెలు, గొర్రెలు 19,258, మేకలు 2,917, పందులు 87 ఉన్నాయి. నెలరోజుల పాటు డోర్ టు డోర్ జరిగిన ఈ కార్యక్రమం నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో గాలికుంటు వ్యాధి లక్షణాలు తీవ్రతలు, నష్టాలపై కథనం.

గాలికుంటు వ్యాధి ఆఫ్తో వైరస్ వలన సోకుతుంది. వ్యాధి బారిన పడ్డ పశువు పాలు, నోటి నుంచి కారే చొంగ, కలుషితమైన నీరు, మేత, పాత్రల వలన, గాలి ద్వారా ఒక పశువు నుంచి మరొక పశువుకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చీలిక ఉన్న గిట్టలున్న పశువులైన గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు అన్నీ ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

ప్రత్తిపాడు: గాలికుంటు వ్యాధికి చికిత్స.. ప్రత్యేకంగా ఈ వ్యాధికి సరైన చికిత్స అనేది లేదు. నివారణమే ఏకైక మార్గం. వైరస్ పశువు శరీరంలోకి ప్రవేశించాక 2 నుంచి 14 రోజుల్లో వృద్ధి చెందుతుంది. తొలుతనే గుర్తించి పశువైద్యాధికారులను సంప్రదించి జ్వరానికి యాంటిపైరెటిక్స్, ద్వితీయ శ్రేణి ఇన్ఫెక్షన్ రాకుండా యాంటీబయాటిక్స్ వాడాలి. నోటిలోని పొక్కులకు బోరో గ్లిసరిన్ పేస్ట్ వాడాలి. పొటాషియం పెర్మంగానేట్ ద్రవాన్ని నోటిలో పొక్కులకు వాడాలి. గిట్టల మధ్య పుండ్లకు పొటాషియం పెర్మంగానేట్ ద్రవంతో శుభ్రపరిచి యాంటిస్పెటిక్ ఆయింట్మెంట్లు వాడాలి. పశువుకు మెత్తగా ఉండే మేత, జావలు తాగించాలి. పరిశుభ్రమైన నీటిని తాగించాలి.

వ్యాధి లక్షణాలు-నష్టాలు

- తీవ్రమైన జ్వరం బారినపడి జీవాలు నీరసంగా ఉంటాయి
- తొలుత నోటిలో చిన్న చిన్న పొక్కులు లేచి పెద్దవి అయ్యి పగిలిపోతాయి.
- దీంతో నోటి నుంచి తీగల్లాగా చొంగ పడుతుంది.
- నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు పతాయి.
- పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.
- కొద్దిపాటి ఎండలకు కూడా రొప్పడం
- చూడి పశువులు ఈసుకుపోవడం
- పాలు తాగే దూడలలో అయితే మరణాలు సంభవించడం
- వైద్యం చేయించకుండా నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించడం

పాడి రైతులు వెంటనే స్పందించాలి



గత నెల 15 నుంచి నేటి వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం డోర్ టు డోర్ నిర్వహించాం. దాదాపుగా పాడి రైతు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి మా సిబ్బంది టీకాలు వేశారు. ఎక్కడైనా ఎవ్వరైనా తమ జీవాలకు వ్యాక్సిన్ వేయించకుండా ఉంటే వెంటనే సంబంధిత ప్రాంతంలోని పశువైద్యాశాలలను సంప్రదించాలి.

–కె. సుగణ్యరావు, ఏడీ, ప్రాంతీయ పశువైద్యశాల, ప్రత్తిపాడు



గాలికుంటు వ్యాధి లక్షణాల ఫోటోలు

టీకాలతో లాభాలు

పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల వలన పాడి రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయి. పాడి పశువుల్లో వ్యాధిని నిరోధించి, పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చు. మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గకుండా కాపాడుకోవడం, దూడల్లో మరణాలను నివారించి ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

క్లుప్తంగా

ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి



పెదకాకాని: ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తగా ఎదగాలని పెదకాకాని మండల అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల నిర్వహించే మహిళల అభ్యున్నతి కోసం ఆర్‌ఏఎంపీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ మహిళలు మరింత అభివృద్ధి చెందటానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యమం స్కీంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ స్కీంలో రిజిస్ట్రేషన్ అయితే వారు నిర్వహించుకునే వ్యాపార కార్యకలాపాలను బట్టి సబ్సిడీతో కూడిన రుణాలు బ్యాంకర్లు అందిస్తారన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 25 లక్షల మంది ఎంఎస్ఎమ్ఈలు ఉండగా కేవలం 14 లక్షలు మంది మాత్రమే ఉద్యమం స్కీం లో నమోదయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా ఏపీఎం రాజు, యానిమేటర్లు, మహిళ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే దంత వ్యాధులకు సకాలంలో చికిత్స

- సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్
- ముగిసిన దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన



పెదకాకాని: ప్రతి ఒక్కరూ దంత వ్యాధులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సకాలంలో సరైన చికిత్స చేయించుకోవచ్చని సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్ అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ కళాశాలలో దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శన చివరిరోజు మంగళవారం కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబార్‌లో ఏర్పాటు చేసిన దంత వైద్య వైజ్ఞానిక సదస్సుకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ ప్రదర్శనను 3000 మందికి పైగా ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు తిలకించి దంత వ్యాధులు వాటి నివారణకు నూతన చికిత్సా పద్ధతులను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనలో ముఖ్యంగా నోటి కేన్సర్ నివారణ, పొగాకు అలవాటు మానడం, మెడికల్ ఎమర్జెన్సీ సందర్భంగా అత్యవసర వైద్య విధానంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ

గుంటూరు రూరల్: నగరంలోని రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎల్ఎస్‌డీజీ థీం 5 పరిశుభ్రత, పచ్చదనం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో క్లీన్ గ్రీన్ విలేజ్ లక్ష్యంను 2030 లోపు సాధించడానికి పాటించాల్సిన వివిధ రకాల వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో బీ రోజా ప్రకాష్, ఎ. శ్రీదేవి, సత్యానంద్ మాస్టర్ ట్రైనర్స్‌గా వ్యవహరించారు. కార్యక్ర మంలో మండల పరిపాలన అధికారికి కె.విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, సచివాలయడిజిటల్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జ్యోతికి ఏఎన్‌యూ డాక్టరేట్



ఏఎన్‌యు(పెదకాకాని): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ విభాగ పరిశోధకురాలు యేటుకూరి జ్యోతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య వై అశోక్ కుమార్ పర్యవేక్షణలో 'ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ ఉమెన్ త్రూ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఏ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించారు.

జీఎస్టీతో విప్లవాత్మక మార్పులు

ఏఎన్‌యు(పెదకాకాని): భారత ఆర్థిక వ్యవస్థలో జీఎస్టీ 2.0 విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని తమిళనాడు మాజీ ఆదాయపన్ను కమిషనర్ జాన్సన్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్య వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారతదేశంలో జీఎస్టి ఆదాయపన్ను వ్యవస్థల అభివృద్ధి, నిర్మాణం అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వర్సిటీ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ సౌత్ జోన్ డీఎస్పీ జి.భానోదయ సూచన



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలోగల ఎమ్‌బీటీఎస్ ప్రభుత్వ పాలిటిక్నిక్ కళాశాలలో డ్రగ్స్ అబ్యూస్, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్టెప్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సౌత్ జోన్ డీఎస్పీ జి.భానోదయ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత వారి ఆరోగ్యంతోపాటు వారి జీవితాలను నాశనం అవుతాయన్నారు. అనైతిక చర్యలకు పాల్పడటం వల్ల సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని, చట్టపరంగా శిక్షలు అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. స్టెప్ యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం అందించవద్దని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.శేఖర్, జూనియర్ అసిస్టెంట్ సాత్విక్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

పొన్నూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

బంగారం మాయంపై విచారణ జరిపించాలి

- కూటమి ప్రభుత్వంలో దేవుడి ఆభరణాలకు రక్షణ కరువైంది
- పెదకాకాని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: కూటమి ప్రభుత్వంలో దేవుడి ఆభరణాలకు రక్షణ కరువైందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అన్నారు. పెదకాకాని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయంలోని భ్రమరాంబ అమ్మవారికి రాజ్య సభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కుటుంబం 132 గ్రాముల బంగారు వడ్డాణం సమర్పిస్తే ఆగస్టు 18వ తేదీన ఆభరణాల తనిఖీలో 30 గ్రాములు తగ్గిందన్నారు. దాదాపు 2 నెలలుగా కనిపించని బంగారం ఈనెల 12వ తేదీన పత్రికల్లో ప్రచురణ కావడంతో అదే రోజు సాయంత్రం బీరువాలో బంగారం ఉందని దేవాలయ అధికారులు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు ప్రకటించిన బంగారం కొత్తగా కొనుగోలు చేశారా, మాయం చేసిన వ్యక్తే తీసుకు వచ్చి ఇచ్చాడా అనేది తెలియాలంటే కమిటీ వేసి విచారించాలన్నారు. ఆలయంలో చికెన్ వంటకంపై గందరగోళం చేసి పసుపు నీళ్లు చల్లిన కూటమి నాయకులు గర్భగుడిలో బంగారం మాయంపై మాత్రం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దానబోయిన నాగేశ్వరరావు, పెండెం విజయ్‌బాబు, తాతినేని నాగేశ్వరరావు, బండ్లమూడి బానుకిరణ్, రెడ్డి నాగేశ్వరరావు, బందెల ఉదయ్‌శంకర్, ఆలూరి వెంకట్రావు, యడ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

మాయమైన బంగారంపై ఆర్జేసీ విచారణ

పెదకాకాని: శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ఆభరణాల్లో బంగారు తగ్గడంపై దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ విచారణ చేపట్టారు. పెదకాకాని శివాలయంలో ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీన స్వామివారి ఆభరణాల తనిఖీ నిమిత్తం జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారిణి సైదమ్మబాయి విచ్చేశారు. ఈ సమయంలో భ్రమరాంబ అమ్మవారికి దాతలు సమర్పించిన వడ్డాణం 132 గ్రాములకు గాను 102 గ్రాములు మాత్రమే ఉంది. అర్చకుల పర్యవేక్షణలో ఉండే బంగారు ఆభరణాల బరువు తగ్గడం, చర్యలు తీసుకోకపోవడంపై మంగళవారం ఆర్జేసీ చంద్రశేఖర ఆజాద్ శివాలయానికి విచ్చేశారు. ముందుగా అర్చకులతోనూ అనంతరం అధికారులతోనూ ప్రత్యేకంగా మాట్లాడారు.

ఆటో డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి మంగళవారం తీర్పు వెలువరించారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌పరిధిలోని దాసరిపాలెం ప్లాట్లలో నివాసం ఉండే జిడుగురి వెంకట్రావు 2016 డిసెంబరు 6న దాసరి పాలెం నుంచి గుంటూరుకు ఆటోలో బల్దేరాడు. పొత్తూరు సమీపంలో ఆటోడ్రైవర్ వెంకటరెడ్డి ఆటోను నిర్లక్ష్యంగా నడిపి బోల్తాపడగొట్టాడు. ఆటోలో ప్రయాణికుడు వెంకట్రావును తీవ్ర గాయాలు జీజీహెచ్‌లో చికిత్స పొంది నల్లపాడు పోలీసులకు సంఘటనపై ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు వెంకట రెడ్డి దోషిగా నిర్ధారణ కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

నీరు తోడించి.. మురుగు తొలగించి...

- వెనిగండ్లలో స్పందించిన యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన చర్యలు

సాక్షి ఎఫెక్ట్



మురుగును తోడిస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు

పెదకాకాని: అధ్వానంగా మారిన పారిశుద్ధ్యం మెరుగు పరచేందుకు మండల అధికారులు ముందుకు వచ్చారు. గుడిసెల చుట్టూ చేరిన నీటిని మోటార్‌తో బయటకు తోడించడంతో పాటు ఎయిర్‌వాల్‌లో చేరిన మురుగును బయటకు తీసి శుభ్రం చేశారు. మండలంలోని వెనిగండ్ల గ్రామ పరిస్థితిపై పల్లెల్లో గాడి తప్పిన పాలన పేరుతో మంగళవారం సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు గ్రామానికి చేరుకుని వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట పేదల గుడిసెల చుట్టూ చేరిన మురుగునీటిని మోటార్‌తో బయటకు తోడించారు. అలాగే రోడ్లపై పేరుకు పోతున్న చెత్త కుప్పలను తొలగించారు. ముస్లిం పాలెంలోని ఎయిర్‌వాల్‌లో పేరుకు పోయిన మురుగు, నీటిలో నానుతున్న పాత చెప్పులను బయటకు తీయించి శుభ్రం చేయించారు. నెలల తరబడి పేరుకుపోతున్న పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచేందుకు స్పందించిన అధికారులకు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

అసలు మా వీవోకు రిజిస్ట్రేషనే లేదు!

విచారణాధికారికి స్పష్టం చేసిన గొట్టిపాడు రాధాకృష్ణ వీవో సభ్యులు



ప్రత్తిపాడులో విచారణ చేస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు

ప్రత్తిపాడు: రాధాకృష్ణ వీవోకు అసలు రిజిస్ట్రేషనే లేదని అలాంటప్పుడు వీవోఏకు సంఘం నుంచి జీతాలు ఎలా ఇస్తారని సంఘ సభ్యులు విచారణాధికారి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘంలో బైలా నిబంధనలకు విరుద్ధంగా, సంఘ ఈసీ సభ్యులకు తెలియకుండా వీవోఏను అక్రమంగా ఎన్నుకుని ఆమెతో విధులు నిర్వర్తిస్తున్నారంటూ కొద్ది నెలల కిందట గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు కె. రజిని పీజీఆర్ఎస్‌లో పిర్యాదు చేశారు. స్పందించిన అప్పటి కలెక్టర్ విచారణాధికారిగా డీఎల్‌డీవోను నియమించారు. ఆయన విచారణ సక్రమంగా చేయలేదని, ఏకపక్షంగా చేశారని మరలా విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని గ్రామైఖ్య సంఘం సభ్యులు మరలా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణాధికారిగా జెడ్పీ సీఈవోను నియమించారు. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేదీన గొట్టిపాడు పంచాయతీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో విచారణ చేపట్టారు. వీవోలో మొత్తం 30 డ్వాక్రా గ్రూపులు ఉండగా వాటిలో 18 గ్రూపుల ప్రతినిధులు మాత్రమే విచారణకు హాజరయ్యారు. దీంతో తక్కువ గడువులో విచారణ నోటీసులు ఇవ్వడం వలన తక్కువ గ్రూపుల సభ్యులు విచారణకు హాజరయ్యారని, అందుచేత మరో తేదీన విచారణ నిర్వహించాలని మహిళలు కోరారు. ఈ క్రమంలో మంగళవారం విచారణాధికారి జెడ్పీ సీఈవో జ్యోతిబసు ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. గ్రూపుల సభ్యులను ఒక్కొక్కరిగా విచారించి, వారి నుండి లిఖితపూర్వక స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు బైలా నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నుకున్న వీవోఏను పక్కనబెట్టి ఇతరులు వీవోఏ విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఓబీలను సైతం రహస్యంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విచారణాధికారికి చెప్పినట్లు మహిళలు తెలిపారు. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించడం జరిగిందని, విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని జెడ్పీ సీఈవో జ్యోతిబసు తెలిపారు.

మందుల పిచికారీలో రైతులు జాగ్రత్తలు పాటించాలి



రక్షణ కిట్లతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పంటలలో రసాయనిక మందు పిచికారీ చేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అభ్యుదయ రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థినులు క్షేత్రస్థాయిలో రైతులకు రక్షణ పరికరాలతో చేసి చూపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు రక్షక వస్త్రాలు ధరించకుండా పంటల్లో రసాయనిక ఎరువులను పిచికారీ చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. రక్షణ కిట్లను ధరించే విధానం, చేతులు శుభ్రం చేసుకోవటం, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థినులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌తో ప్రయోజనం

సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్



మాట్లాడుతున్న డాక్టర్ ఫిరోజ్ ఖాన్

పొన్నూరు: గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నప్పుడు సీపీఆర్ ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడగలమని, ఈ ప్రక్రియ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ సూచించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సీపీఆర్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ గుండె కొట్టుకోవడం ఆగిపోవడం, శ్వాస తీసుకోలేని అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడగలమని అన్నారు. కార్డియాక్ అరెస్టు బాధితుల్లో ఈ ప్రక్రియ పై అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు
- పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

పెదకాకాని: అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇండ్ల పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని మరింత అద్భుతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు హెచ్చరించారు. మండల కేంద్రమైన పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఇండ్ల స్థలాలు పట్టాల సాధన కోసం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ మండలంలోని సుందరయ్య కాలనీ, ఎస్‌టి కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హస్పర్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, స్వర్ణపురి కాలనీల్లో గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బురదగుంట సాంబయ్య, కె.సత్యనారాయణ, వెంకట రమణ, ఎ.నాగేశ్వరావు, పలువురు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్‌రహిత గ్రామాలే లక్ష్యం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అర్జునరావు

ప్రత్తిపాడు: ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. అర్జునరావు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం గ్రామాల్లో ఈడీ అర్జునరావు పర్యటించారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు అనుగుణంగా ఎస్‌డబ్ల్యూపీసీలో సరిపడా స్థలం, త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్, ఫెన్సింగ్, రహదారి.. వంటి సౌకర్యాలున్నాయా లేవా అన్న విషయాలను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదంషఫీ, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజాలను అడిగి షెడ్ నిర్వహణకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. వెంట ప్రత్తిపాడు ఎంపీడీవో కె. శివపార్వతి, డీడబ్ల్యూఎస్‌సి జిల్లా కన్సల్టెంట్లు ఉన్నారు.

అలా వెళ్లిపోతారేమిటీ.. కూర్చోండి మీరంతా!

- ఎంపీడీవో చెబుతున్నా వెళ్లిపోయిన ప్రజాప్రతినిధులు, అధికారులు!
- మొక్కుబడిగా చేబ్రోలు మండ పరిషత్ సమావేశం



సమావేశంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

చేబ్రోలు: సమావేశం జరుగుతుంటే పంచాయతీ కార్యదర్శులు, అధికారులు వెళ్తున్నారేంటీ కుర్చోండి అని చేబ్రోలు ఎంపీడీవో ఊహారాణి ఆదేశిస్తున్నా పట్టించుకోకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకరి వెంట ఒకరు వెళ్లిపోవటంతో చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా జరిగింది. చేబ్రోలు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో ఊహారాణి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రదానమైన వివిధ మండల శాఖాధికారులు హాజరుకాలేదు. కింద స్థాయి సిబ్బందిని పంపి మమ అనిపించారు. ప్రస్తుత సీజన్‌లో ముఖ్యమైన వ్యవసాయశాఖ ఏవో హాజరుకాలేదు. యూరియా, ఎరువులు, పంట కొనుగోలు తదితర అంశాల గురించి వివరించాల్సి ఉంది. ఏఈవోను పంపి చేతులు దులుపుకున్నారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దారు, డ్వాక్రా సంఘాల నుంచి ఏపీఎం, ఈవోపీఆర్డీ తదితర శాఖల నుంచి అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి కొద్ది సేపు కుర్చొని వెళ్లిపోయారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రదానమైన సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించటం, తెలియజేయటం లేకుండానే మొక్కుబడిగా ప్రహసనంగా సాగిపోయింది. ఎంపీడీవో ఊహారాణి చెబుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు వినిపించుకోకుండా సమావేశం నుంచి వెళ్లిపోవటం గమనార్హం. సుమారు గంట సేపు జరిగిన సమావేశంలో చివరకు సమావేశపు హాలులో ఎంపీపీ, ఎంపీడీవోలతో పాటు కొద్దిమంది మాత్రమే మిగిలిపోవటంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ ప్రదాన రహదారి గుంతమయంగా మారి అధ్వాన్నాంగా మారిందని శలపాడు ఎంపీటీసీ వెంకటేశ్వరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.